
ఆరు గ్యారంటీలు అమలు చేయకపోతే నిలదీస్తాం..
- అర్హులందరికీ పీఎం కిసాన్ అందేలా చర్యలు
- కొత్తకొండ ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్


5

జీఐఆర్ అమలుకు అవకాశాలను పరిశీలించండి

వరంగల్ కార్పొరేషన్, జూన్ 21 : జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ అమలుకు గల అవకాశాలను పరిశీలించాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. శుక్రవారం వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయంలో జియో విస్త టెక్నాలజీ అధికారులతో కలిసి మాట్లాడారు. నిర్వహణ తీరును కంపెనీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ప్రతినిధులు కమిషనర్ అశ్విని తానాజీ వాకడేకు ఈ విధానం అమలు వల్ల కలిగే లాభాలను వివరించారు. ఈసాంకేతికత వల్ల ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించవచ్చని విశ్లేషించారు. రోడ్ల నెట్‌వర్క్, నీటి సరఫరా, డ్రైనేజీల స్థితిగతులతో పాటు 66 డివిజన్లలో ప్రజల అవసరాలు తెలుసుకునేందుకు ఈ సాంకేతికత బాగా ఉపయోగపడుతుందని అన్నారు. ఈ సాంకేతికతను మరోసారి డెమో ద్వారా వెల్లడిస్తామని వారు తెలిపారు. ఈ సమావేశంలో జియో సీనియర్ వైస్ ప్రెసిడెంట్లు అశోక్‌శర్మ, కాంత్రి, నగర సీపీ వెంకన్న, ఐటీ రమేష్, సిబ్బంది శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోలీస్ పోస్టింగ్.. పరేషాన్!



- పాత స్థానాల్లోకి మళ్లీ వచ్చేందుకు పలువురి ఆసక్తి
- ప్రస్తుత స్టేషన్లలోనే కొనసాగాలి అనుకుంటున్న కొందరు..
- పైరవీల కోసం నేతల చుట్టూ ప్రదక్షిణలు
- ఎస్ఐల నుంచి ఏసీపీల వరకు ఎవరి ప్రయత్నాల్లో వారు
- ఇదే అదనుగా రంగంలోకి దళారులు
- పోస్టింగుకో రేటు ఫిక్స్..
- నగర శివారుల్లోని స్టేషన్లకు ఫుల్ డిమాండ్
- సిఫారసు లేఖ లేకుంటే ఎంత సిన్సియర్‌గా జాబ్ చేసినా లూప్ లైన్‌కేనని చర్చ

ఎన్నికల కోడ్ ముగియటంతో పైరవీలు మొదలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

పోలీసుల్లో బదిలీల టెన్షన్ మొదలైంది. ఎన్నికల కోడ్ ముగియడంతో తమను ఎక్కడికి బదిలీ చేస్తారోనన్న ఆందోళన కనిపిస్తోంది. దీంతో సిఫారసు లేఖల కోసం నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మంచి చోట పోస్టింగ్ ఇప్పిస్తే భారీగా నజరానాలు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఎస్ఐల నుంచి ఏసీపీల వరకు తాము కోరుకున్న పోస్టింగ్‌ల ఇప్పించేలా పైరవీ చేయాలంటూ తిరుగుతున్నారు. అయితే ఎన్నికలకు ముందు పైరవీలతో పోస్టింగ్ కొట్టిన కొందరు మూడు రోజులు తిరగకముందే ఎన్నికల కోడ్ పేరుతో బదిలీ అయ్యారు. వారిలో చాలామంది నాటి తమ పోస్టులు తిరిగి తమకే ఇవ్వాలని నేతలపై ఒత్తిడి తెస్తుండగా, ప్రస్తుతం డ్యూటీల్లో ఉన్న అధికారులు ఇక్కడే కొనసాగేలా నేతలపై ఒత్తిడి తీసుకొస్తున్నట్టు చర్చ జరుగుతోంది. దీంతో నేతలు ఎవరికి సిఫార్సు లేఖలు ఇస్తారో అనే ఉత్కంఠ నెలకొంది.

ఐఏఎస్, ఐపీఎస్‌లతో బదిలీలు షురూ..

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో ప్రభుత్వం ఎన్నికల ముందు జిల్లాలో మూడేళ్లకు పైగా పని చేసిన వారిని, సొంత జిల్లాలో పని చేసినవారిని బదిలీ చేసివారి స్థానంలో కొత్త వారిని నియమించింది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగియటంతో పరిపాలనపై దృష్టి పెట్టిన ప్రభుత్వం గత ప్రభుత్వం నియమించిన కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎస్పీలు, డీసీపీలను బదిలీలు చేసింది. ఇందులో భాగంగా దీంతో ఈ నెల 15వ తేదీన ఉమ్మడి జిల్లాలోని భూపాలపల్లి, ములుగు, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లను బదిలీ చేసింది. వరంగల్ వెస్ట్ (జనగామ), వరంగల్ సెంట్రల్ డీసీపీలకు కూడా స్థానం చలనం జరిగింది. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత పెద్ద ఎత్తున ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీలు చేపట్టడంతో తరువాత కిందిస్థాయి అధికారుల బదిలీలు ఉంటాయనే చర్చ జరుగుతోంది. వరంగల్ కమిషనరేట్‌తో పాటు భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లోనూ ఎస్ఐ, సీఐ, డీఎస్పీల బదిలీపై అధికార పార్టీ నేతలు దృష్టిసారించారు. దీంతో రెండుమూడు రోజుల్లో భారీగా బదిలీలు జరిగే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.

దళారుల రంగ ప్రవేశం!

బదిలీల పర్వం మొదలవటంతో మంచి పోస్టింగ్ కోసం నేతల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే కొందరు ఎమ్మెల్యేలు, నేతలు ఖాకీల పనితీరు కంటే సామాజిక వర్గానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారనే చర్చ జరుగుతోంది. సామాజిక వర్గం అధికారులు లేకుంటే సమర్థత, విశ్వసనీయత, పనితీరు, పాత పరిచయాలు తదితర అంశాలను బేరీజు వేసుకుంటున్నారనే అభిప్రాయాలున్నాయి. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌తో పాటు మహబూబాబాద్, భూపాలపల్లి జిల్లాలో ఇచ్చే పోస్టింగుల్లో ఎక్కువ శాతం తమ సామాజిక వర్గానికి చెందిన అధికారులకే సిఫార్సులు చేస్తున్నారనే చర్చ జరుగుతుండగా మరికొన్ని చోట్ల పోస్టింగుకో రేటు ఫిక్స్ చేసి దళారులతో బేరసారాలకు దిగుతున్నారనే ప్రచారం ఉంది. వరంగల్ నగరం సమీపం లోని ఓ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే పోలీస్ స్టేషన్లకు భారీగా ధర పలుకుతుందనే చర్చ సాగుతోంది. నగరం నడిబొడ్డున ఉన్న ఓ ఏసీపీ పోస్టింగ్ కోసం పొరుగు జిల్లా మంత్రితో ఓ అధికారి పైరవీలు చేస్తున్నారని సమాచారం. పరకాల నియోజకవర్గం పరిధిలో రెండు స్టేషన్లలో పోస్టింగుల విషయంలో ముగ్గురు నేతలు వేర్వేరుగా సిఫార్సులు చేస్తున్నారని సమాచారం. నగర పరిధిలో ఉండే నాలుగైదు స్టేషన్లలో పోస్టింగ్ కోసం భారీగా క్యూ కడుతున్నారని తెలుస్తోంది.



మా కుర్చీ మాకే కావాలి..

పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఫిబ్రవరి నెలలో ఉమ్మడిజిల్లాలో భారీగా పోలీసుల బదిలీలు జరిగాయి. అధికారపార్టీ ఎమ్మెల్యేలు, కీలక నేతలు సూచించిన వారికి పోస్టింగులు దక్కాయి. ఆ సమయంలో కొందరు నేతలు భారీగా తీసుకుని పోస్టింగులు ఇప్పించారని, కొన్నిస్టేషన్ల ఎస్‌హెచ్‌వోల పోస్టింగులకు రూ.20లక్షల నుంచి రూ.25లక్షల వరకు చేతులు మారాయని ప్రచారం జరిగింది. అయితే ఫిబ్రవరిలో విధుల్లో చేరిన కొంతమంది అధికారులకు మార్చిలో జరిగిన బదిలీల్లో స్థానచలనం తప్పలేదు. అప్పటికే సిఫార్సు లేఖల కోసం భారీగా సమర్పించుకున్న వారు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చింది. ప్రస్తుతం కోడ్ ముగియటంతో మళ్లీ తమ పాత స్థానాలు తమకే ఇప్పించాలని పట్టుబడుతున్నట్టు సమాచారం. అయితే ఆ పోస్టు ఆ సిఫార్సు లేఖ వరకే అని.. మళ్లీ పోస్టు కావాలంటే ఆలోచిస్తామంటూ వరంగల్ నగర సమీపంలోని ఓ నేత ఖాకీలను ఇంటి చుట్టూ తిప్పుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా వేరే అధికారులకు పోస్టింగులు ఇచ్చేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో దళారులు రంగంలోకి దిగి బేరసారాలు మొదలు పెట్టినట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో తమ పాత పోస్టింగ్ వస్తుందా..లేదా అనే టెన్షన్‌లో కొందరు పోలీసులు ఉండగా, ఎన్నికల బదిలీల్లో వచ్చిన అధికారులు కొందరుఅదే స్టేషన్‌లో ఉండేందుకు ప్రయత్నాలు చేస్తున్నారట. తమకున్న పరిచయాలతో ఆయా ఏరియాల్లోని కీలకనేతలపై ఒత్తిడి తెస్తున్నారట. ఇలా పోస్టింగుల కోసం జరుగుతున్న ఫైటింగ్‌లో కుర్చీ ఎవరికి దక్కుతుందో అనే ఉత్కంఠ ఖాకీల్లో నెలకొంది.

సిఫారసు లేకుంటే లూప్‌లైన్‌లోకే..

పోలీసు శాఖలో నిజాయితీగా పని చేసే కొంతమంది అధికారులకు లూప్ లైన్ డ్యూటీస్ తప్పటం లేదు. కానిస్టేబుల్ నుంచి ఏఎస్పీ స్థాయి అధికారి బదిలీ వరకు పైరవీలు నడుస్తున్నాయనే ఆరోపణలున్నాయి. అన్ని శాఖల కంటే పోలీస్ శాఖలోనే అధికంగా బదిలీలపై రాజకీయ ఒత్తిళ్లు ఉంటాయనే అభిప్రాయాలు ఉన్నాయి. దీంతో నిజాయితీగా విధులు నిర్వహించే కొంతమంది అధికారులు, పైరవీలు చేయటం ఇష్టం లేని అధికారులకు లూప్ లైన్ డ్యూటీలు తప్పవనే చర్చ జరుగుతోంది. అనేక మంది పోలీసు అధికారులు నిజాయితీగా పని చేసినా, రాజకీయ పలుకుబడి లేకపోవటంతో లూప్ లైన్‌లో ఏళ్ల తరబడి కొనసాగుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం సిఫార్సు లేఖలకు కాకుండా బాధ్యతయుతంగా పని చేస్తున్న వారిని గుర్తించి పోస్టింగులు ఇవ్వాలనే డిమాండ్ కొందరు పోలీసుల నుంచి వినిపిస్తోంది.



ఆర్థికాభివృద్ధిలో పొదుపు కీలకం

- వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రవిందర్‌రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న వరంగల్ చాంబర్ అధ్యక్షుడు రవిందర్‌రెడ్డి

గిర్మాజిపేట, జూన్ 21 : డబ్బు సంపాదించడంతో పాటు సరిగా వినియోగించడం, పొదుపు చేయడం ద్వారానే ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చని వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవిందర్‌రెడ్డి అన్నారు. మోడల్ కూరగాయల మార్కెట్ వ్యాపారులు డబ్బు పొదుపుతో తమ కుటుంబాలు, వ్యాపారాలను వృద్ధి చేసుకోవాలని సూచించారు. వరంగల్‌లోని (మిగతా 6వ పేజీలో)

ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రణాళిక

- కేంద్ర సంక్షేమ బృందం సభ్యుడు డాక్టర్ వరుణ్‌రెడ్డి
- నగరంలోని దేశాయిపేట పట్టణ ఆరోగ్య కేంద్రం సందర్శన



కేంద్ర సంక్షేమ బృందానికి స్వాగతం పలుకుతున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

పోచమ్మమైదాన్, జూన్ 21: కేంద్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్య పరిరక్షణ పట్ల శ్రద్ధ వహిస్తూ ప్రత్యేక ప్రణాళికలు అమలు పరుస్తుందని కేంద్ర సంక్షేమ బృందం సభ్యుడు డాక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. వరంగల్ నగరంలోని దేశాయిపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం సంక్షేమ శాఖ కేంద్ర బృందం సందర్శించింది. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ నేతృత్వంలో సంక్షేమ శాఖ కేంద్ర బృందం సభ్యులు డాక్టర్ వరుణ్‌రెడ్డి, డాక్టర్ కిరణ్‌రెడ్డి ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. మాతా, శిశు ఆరోగ్య సంరక్షణ, ఎన్సీడి, లెప్రసి, మలేరియా, డెంగీ జాతీయ కార్యక్రమాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది అంకితభావంతో పనిచేసి ఆరోగ్య సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గోపాలరావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భరత్‌కుమార్, జిల్లా ఎన్సీడి సూపర్‌వైజర్ రేవూరి ప్రకాష్‌రెడ్డి, డీపీవో అర్చన, పబ్లిక్ హెల్త్ మేనేజర్ జన్ను కొర్నెలు, ఫార్మసిస్టు అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తనువు, మనసు, ఆత్మను ఏకం చేసేదే యోగా

- కలెక్టర్ సత్య శారదాదేవి
- ఓసిటీ మైదానంలో ఘనంగా యోగా దినోత్సవం



యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ సత్య శారదాదేవి, ఇతర ఉన్నతాధికారులు

వరంగల్ సిటీ, జూన్ 21 : తనువు, మనసు, ఆత్మను ఏకం చేసేదే యోగా అని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి అన్నారు. 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం వరంగల్‌లోని ఓసిటీ మైదానంలో నెహ్రూ యువకేంద్రం, జిల్లా యువజన క్రీడలు, ఆయూష్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరై జ్యోతి ప్రజ్వలనచేసి యోగాసనాలు వేయడంతో పాటు అందరితో చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్య శారదాదేవి మాట్లాడుతూ.. ఈ సంవత్సరం యోగా దినోత్సవాన్ని యోగా ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీ అనే అంశంపై ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నారని తెలిపారు. భారతీయ జీవన విధానంలో యోగా ఇమిడిపోయిందన్నారు. ఆదిశంకరాచార్యులు చెప్పిన భజగోవిందంలో యోగాకు సంబంధించిన సాంస్కృతిక చరణాలు వినిపించాయన్నారు. యోగా మన ప్రాచీన సంప్రదాయం నుంచి లభించిన అమూల్యమైన కానుక అన్నారు. మనసు, శరీరం, ఆలోచన, ఐక్యత, కార్యాచరణ యోగాను ప్రతిబింబిస్తుందని తెలిపారు. ప్రపంచంతో, ప్రకృతితో, ఏకత్వ భావనను కనుగొనడానికి ఒక మార్గమని, ప్రతి ఒక్కరూ ఉదయం యోగాకు కొంత సమయం కేటాయించాలని సూచించారు. శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటూ లక్ష్యాలను సాధించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీసీవో సంజీవరెడ్డి, డీపీఆర్‌వో ఆయూబ్ అలీ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషాదయాల్, డీవైఎస్‌వో సత్యవాణి, జీఎం ఇండస్ట్రీస్ నర్సింహమూర్తి, ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఎంలో జూనియర్ డాక్టర్ల నిరసన

- నల్ల దుస్తులు, బ్యాడ్జీలు ధరించి వైద్య సేవలు

వరంగల్ మెడికల్, జూన్ 21: ఉపకార వేతనాలు చెల్లించి, ఎంజీఎం డాక్టర్లకు కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ జూనియర్ డాక్టర్లు నిరసన చేపట్టారు. శుక్రవారం నల్ల దుస్తులు, నల్లబ్యాడ్జీలు ధరించి వైద్యసేవలు అందించారు. అత్యవసర సేవలు మినహా ఎంజీఎంలో అన్ని సేవలకు జూనియర్ డాక్టర్లు దూరంగా ఉన్నారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్లు మాట్లాడుతూ డాక్టర్ల కోసం కొత్త హాస్టల్ భవనాలు నిర్మించాలని, ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అధికారుల నుంచి సరైన చర్యలు లేకపోవడంతోనే సమ్మె తప్ప మరో మార్గం లేకుండా పోయిందన్నారు. దీంతో ఈ నెల 24వ తేదీన సమ్మెకు దిగుతున్నట్లు సమ్మె నోటీసు విడుదల చేశారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుంటే నిరవధికంగా సమ్మె కొనసాగిస్తామని జూనియర్ డాక్టర్లు పేర్కొన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంజీఎం ఆస్పత్రిలోని మహాత్మాగాంధీ విగ్రహానికి అందజేశారు.



గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న జూనియర్ డాక్టర్లు

నిర్మాణ పనుల్లో నిబంధనలు పాటించాలి

- నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



వరంగల్ శాకరాసికుంటలో తనిఖీలు చేస్తున్న కమిషనర్ అశ్విని

వరంగల్ కార్పొరేషన్, జూన్ 21 : వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి నిర్మాణ పనులలో నిబంధనలు పాటించాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. శుక్రవారం గ్రేటర్ పరిధిలోని సాకరాసికుంట, ఎస్సీ కాలనీ, కీర్తిబార్ ప్రాంతాలతో పాటు బొమ్మలగుడి ప్రాంతంలో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ పనులను స్థానిక అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నిర్దేశిత ప్రమాణాల మేరకు చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లిస్తామన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ అభివృద్ధి పనులు కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ శ్రీనివాస్, డీఈ రవికిరణ్, ఏఈ ముజామిల్ పాల్గొన్నారు.

బండ్ ప్లాంటేషన్ పనులు ప్రారంభించండి

గ్రేటర్ వరంగల్ పరిధిలోని చెరువు కట్టలపై బండ్ ప్లాంటేషన్ పనులు ప్రారంభించాలని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఉద్యానవన విభాగం అధికారులను ఆదేశించారు. శుక్రవారం వరంగల్‌లోని క్రిస్టియన్‌కాలనీలోని నర్సరీ, గొర్రెకుంట సమీపంలోని కట్టమల్లన్న చెరువు, ఏనుమాముల ప్రాంతంలోని ముసలమ్మకుంట ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి బండ్ ప్లాంటేషన్ ప్రణాళికలపై అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వచ్చే వర్షాకాలంలో చాలా చోట్ల మొక్కలను నాటేందుకు సిద్ధం చేయాలని అన్నారు. నగర పరిధిలో కుంటలు, చెరువులు ఆక్రమణకు గురికాకుండా చెరవు కట్టలపైన మొక్కలను పెంచాలని అందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి రమేష్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.


అదనపు గదుల నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ఎమ్మెల్యే నాగరాజు

గ్రామస్థుల చైతన్యంతో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఎమ్మెల్యే నాగరాజు

ఐనవోలు, జూన్ 21: గ్రామస్థుల చైతన్యంతోనే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయనడానికి ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలే నిదర్శనమని, ఆదిశగా గ్రామాల్లో పాఠశాలలను బలోపేతం చేసుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ నిధులు రూ.18 లక్షలతో నిర్మించనున్న ఆదనపు గదుల నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి శంకుస్థాపన చేశా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. మూతపడిన పాఠశాలను గ్రామస్థులు చైతన్యంతో తెరిపించుకోవడమే కాకుండా తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపించకుండా ప్రైవేటు ఉపాధ్యాయులను ఏర్పరుచుకొని మంచి ఫలితాలు సాధించడం సంతోషకరమన్నారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలంటే తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరమన్నారు. ఈ గుర్తింపు పొందిన పాఠశాలను ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు రెండుగా విభజించడంతో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు (ఉపాధ్యాయులు) వస్తారని, అందుకు తనవంతుగా ప్రభుత్వం దృష్టికి ఇక్కడి సమస్యను తీసుకెళ్తానని తెలిపారు.

ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. పాఠశాల పనితీరు అద్భుతంగా ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం కోసం కృషి చేస్తోందన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఆదర్శవంతమైన ఈ పాఠశాలలో మౌలిక వసతులకై తన సీడీఎఫ్ నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు దుస్తులు, నోట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హెచ్ఎం రత్నకుమార్ అధ్యక్షత వహించగా తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ కడుదూరి రాజు, ఎంఈవో వెంకటేశ్వర్‌రావు, అమ్మఆదర్శ కమిటీ చైర్మన్ సకీన, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ పొన్నాల రాజు, నాయకులు సమ్మెట మహేందర్, ఎలిషా, గిరుక రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గుంజేడు శ్రీ ముసలమ్మ గుడి ఆవరణలో భక్తుల కోలాహలం

గుంజేడు శ్రీముసలమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

కొత్తగూడ, జూన్ 21: మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని గుంజేడులోని శ్రీముసలమ్మ జాతరకు శుక్రవారం భక్తులు పోటెత్తారు. వ్యవసాయ పనులు మొదలు పెట్టేముందు రైతులు శ్రీముసలమ్మ దేవతను దర్శించుకోని పంటలు బాగా పండాలని మొక్కుకోవడం, వాగు నీటిని తీసుకువెళ్లి వ్యవసాయ భూముల్లో చల్లుకోవడం అనాదిగా వస్తున్న ఆచారం. అందులో భాగంగా రైతుల కుటుంబాలు అధిక సంఖ్యలో ముసలమ్మ జాతరకు తరలివచ్చారు. కుటుంబసమేతంగా ముసలమ్మ దేవతను దర్శించుకున్నారు. దీంతోపాటు పాఠశాలలు ప్రారంభం కావడంతో పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థుల కుటంబాలు, పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల కుటుంబాలు శ్రీముసలమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నూతన వాహనాలు తీసుకున్న భక్తులు గుడి వద్ద వాహన పూజలు చేశారు. అనంతరం ఆహ్లాదకరంగా అడవిలో వంట లు చేసుకుని వనభోజనాలు చేశారు. కుటుంబసభ్యులతో ఉల్లాసంగా గడిపారు.

అధికారుల తప్పులు.. టీచర్లకు తిప్పలు..

- ప్రహసనంలా ఉపాధ్యాయుల పదోన్నతులు
- గణితంలో నిబంధన తారుమారు
- సోషల్ అడిక్వసీలో ఒక పోస్టు గల్లంతు
- విద్యార్థులు లేని చోట పీడీలకు స్థానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 21: వరంగల్ జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ ప్రహసనంలా మారింది. అధికారులు చేసిన తప్పులకు పంతుళ్లకు తిప్పలు తప్పడం లేదు. నిబంధనలు అధిగమించడం.. రోస్టర్‌ల ను తప్పుగా చూపించడం.. విద్యార్థులు తక్కువగా ఉన్న చోట పోస్టులను ఓపెన్ చేయడం లాంటి తదితర పొరపాట్లను అధికారులు చేయడం వల్ల పదోన్నతుల్లో కొంత మంది ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీటితోపా టు రోస్టర్ విధానంలో తలెత్తిన సాంకేతిక కారణంతో గురువారం రాత్రి వరకు ప్రభుత్వ విభాగంలోని పీఈటీ లు, స్థానిక సంస్థల విభాగంలోని ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్ ఎంలు, ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్‌ల పదోన్నతుల ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. జిల్లాలోని విద్యాశాఖాధి కారులు తప్పుడు జాబితాలను రూపొందించడంతోనే పదోన్నతుల్లో కొందరు ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుందని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు ఆరోపణలు చేస్తుంటే ఉన్నతాధికారుల ఆదే శాల మేరకే జాబితాలను రూపొందించామని డీఈవో వాసంతి పేర్కొన్నారు.

గణితంలో నిబంధన తారుమారు

ప్రభుత్వ విభాగంలోని గణితం స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల్లో నిబంధనలను అధికారులు తారుమారు చేశారని సంబంధిత ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వ విభాగంలో మొత్తం 5 క్లియర్ వేకెన్సీలతో జాబితాను రూపొందించారు. ఇందులో 70 శాతం పదోన్నతులతో, 30 శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పద్ధతిలో భర్తీ చేయాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ మాత్రం ఒక్క పోస్టును మాత్రమే పదోన్నతితో భర్తీ చేశారు. 4 పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌కు అధికారులు నోటిఫై చేయడంతో నిబంధనలను తారుమారు చేసినట్లు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నలుగురు ఉపాధ్యాయులు పదోన్నతులు సాధించాల్సి ఉండగా వారికి మొండిచేయి మిగిలింది.

ఎస్సీల పదోన్నతులు


స్థానిక సంస్థల విభాగంలో సోషల్ స్టడీస్ స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల్లో ఎస్సీల విభాగంలో అడిక్వసీ ప్రకారం అధికారులు పదోన్నతులు నిర్వహించలేదని సంబంధిత ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడిక్వసీ జాబితాలో 9 పోస్టులకు పదోన్నతి కల్పిస్తున్నట్లు జాబితాను రూపొందించిన అధికారులు 8 మందికి మాత్రమే పదోన్నతి కల్పించడంతో మరో ఉపాధ్యాయుడు పదోన్నతి పొందలేకపోయినట్లు వారు ఆరోపిస్తున్నారు. తమకు అడక్వసీ విషయంలో తనకు పదోన్నతి కల్పించాలని కోరుతూ ఓ ఉపాధ్యాయురాలు డీఈవోకు వినతి పత్రం అందజేశారు.

రోస్టర్ పాయింట్లు తారుమారు

వికలాంగుల రోస్టర్ పాయింట్లలోనూ అధికారులు తారుమారు చేసినట్లు ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. స్థానిక సంస్థల విభాగంలోని తెలుగు ఎస్‌ఏ పదోన్నతుల్లో రోస్టర్ పాయింట్ 6లో వీహెచ్ ఉమెన్‌ను కేటాయించాల్సిన చోట వీహెచ్ మెన్ రోస్టర్‌ను కేటాయించడంతో సదరు మహిళా ఉపాధ్యాయురాలుకు అన్యాయం జరిగినట్లు తెలుస్తోంది. ఆ మహిళా ఉపాధ్యాయురాలు డీఈవో కార్యాలయంలో ఈ విషయమై వినతి పత్రం అందజేశారు.

పోస్టులు బ్లాక్

వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ విభాగంలోని స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉన్నతీకరణలోనూ అధికారులు తప్పులో కాలేశారు. విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ ఎక్కువగా ఉన్న చోట పీడీలు అవసరం ఉండగా అందుకు భిన్నంగా విద్యార్థులు తక్కువ సంఖ్యలో ఉన్న పాఠశాలల్లో అధికారులు పోస్టులను ఉన్నతీకరణ చేసి విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో పోస్టులను బ్లాక్ చేశారు. ఖిలావరంగల్ మండలంలోని పలు పాఠశాలల్లో పీడీలు అవసరం ఉండగా వాటిని బ్లాక్ చేసి వరంగల్ మండల పరిధిలో తక్కువ సంఖ్యలో విద్యార్థులున్న పాఠశాలల్లో పీడీల పోస్టులను ఓపెన్ చేశారు. దీంతో అధికారుల తప్పిదంతో అవసరమున్న పాఠశాలల్లో పీడీలు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది.



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే జాబితా

వరంగల్ డీఈవో డి.వాసంతి

పదోన్నతుల ప్రక్రియలో జిల్లాలో రూపొందించిన ప్రతీ జాబితా విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే రూపొందించాం. నిబంధనల మేరకు రోస్టర్ విధానాన్ని అనుసరిస్తూ సీనియారిటీ జాబితాలతో పాటు అప్‌గ్రేడ్ చేశాం. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాలల్లో పీడీ పోస్టుల విషయంలో జరిగిన పొరపాటును ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వాటిని సైతం ఉన్నతాధికారులు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు.

అవసరం లేని చోట అప్‌గ్రెడేషన్

అవసరం లేని చోట అధికారులు ఎల్పీల పోస్టులను అప్‌గ్రేడ్ చేశారని ఉపాధ్యాయుల తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటం, రెండు తరగతులు మాత్రమే ఉన్న చోట్ల రోస్టర్ విధానం పేరుతో అన్యాయంగా అప్‌గ్రేడ్ చేశారని ఉపాధ్యాయులు విమర్శలు చేస్తున్నారు. వరంగల్ మండలంలోని కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలో 6, 7 తరగతుల్లో 15 మంది విద్యార్థులు మాత్రమే ఉండగా అక్కడ ఎల్పీ పోస్టు అప్‌గ్రేడ్ అవసరం లేకున్నా అధికారులు అనవసరంగా అప్‌గ్రేడ్ చేసినట్లు ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయకపోతే నిలదీస్తాం..

- అర్హులందరికీ పీఎం కిసాన్ అందేలా చర్యలు
- కొత్తకొండ ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



కొత్తకొండలో స్వామివారికి కోడె, గుమ్మడికాయ మొక్కులు చెల్లిస్తున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

భీమదేవరపల్లి, జూన్ 21: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకపోతే నిలదీస్తామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ వెల్లడించారు. ఎన్నికల సమయంలో ఎడాపెడా హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరిస్తోందన్నారు. శుక్రవారం రాత్రి భీమదేవరపల్లి మండలానికి వచ్చిన బండి సంజయ్‌కుమార్‌కు బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ముందుగా ముల్కనూర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ శ్రేణులు పెద్దఎత్తున బాణాసంచా పేల్చి సంబరాలు నిర్వహించారు. అనంతరం కొత్తకొండ శ్రీవీరభద్ర స్వామి ఆలయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు ఆలయ ఈవో కిషన్‌రావు ఆధ్వర్యంలో అర్చ కులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వీరభద్రస్వామికి కోడె, గుమ్మడికాయ మొక్కులు చెల్లించారు. వీరభద్రస్వామికి ప్రత్యేకంగా అర్చన, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకు న్నారు. అనంతరం ఆలయ ఆవరణలో బండి సంజయ్ విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కేంద్ర ప్రభుత్వానికి సహకరించి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలని, ఆ తర్వాత అందరూ అభివృద్ధిపై సహకరించుకోవాలన్నారు. కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి దేవాలయానికి పర్యాటక శోభ తీసుకువస్తామన్నారు. ఇందుకు అవసరమయ్యే నిధులను సమీకరిస్తామన్నారు. కొత్తకొండ దేవాలయ అభివృద్ధికి కావాల్సిన ప్రణాళికను రూపొందించాలని ఈవోను కోరారు.

కాగా, రాష్ట్రంలో 2019 తర్వాత వ్యవసాయ భూమి ఉన్నప్పటికీ పీఎం కిసాన్ యోజన రావడం లేదని విలేకరులు ప్రశ్నించగా, ఈ విషయాన్ని ప్రధాని మోదీ, వ్యవసాయ శాఖ మంత్రిత్వ శాఖతో మాట్లాడి విధి విధానాలు రూపొందించేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే భీమదేవరపల్లి ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, బీజేపీ నాయకులు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, దొంగల కొంరయ్య, బీజేపీ మండలాధ్యక్షుడు పైడిపల్లి పృథ్వీరాజ్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి గుండెల్లి సదానందంయాదవ్, గోదల సంపత్, బండారి కరుణాకర్, అంబీరు కవిత, ఊసకోయిల కిషన్, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై తుమ్మలను కలిసిన టెస్కాబ్ చైర్మన్



మంత్రి తుమ్మలకు వివరాలను తెలియజేస్తున్న మార్నేని

హనుమకొండ సిటీ, జూన్ 21: రైతుల రుణ మాఫీ అంశం విషయంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు హైదరాబాద్‌లో శుక్రవారం రాష్ట్ర సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిశారు. సహకార బ్యాంకుల్లో రుణం తీసుకున్న రైతుల్లో రాష్ట్ర వ్యాప్తంగా 7,74,833 ఉన్నట్లు మంత్రికి వివరించారు. రైతులకు లబ్ధిచేకూరేలా నిర్ణయాలు తీసుకోవాలని రవీందర్‌రావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎమ్మెల్యే రవీందర్‌రావు, టెస్కాబ్ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తెయ్య, డీసీసీ బ్యాంకుల చైర్మన్లు పాల్గొన్నారు.

రేపు అవగాహన సదస్సు

వడ్డెపల్లి, జూన్ 21: మానవహక్కులపై జాతీయ స్థాయి. అవగాహన సదస్సు ఆదివారం ఉదయం 11గంటలకు హనుమకొండ ప్రెస్‌క్లబ్ ప్రాంతంలోని ఆదర్శ లా కాలేజీలో నిర్వహించనున్నట్లు నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూవ్‌మెంట్ రాష్ట్రకార్యదర్శి పోలెపాక మధు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్, హనుమకొండ జిల్లాలకు సంబంధించి న సంస్థ ప్రతినిధులందరూ ఈ అవగాహన సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సెల్‌ఫోన్ల అప్పగింత

హనుమకొండ టౌన్, జూన్21: హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా రికవరీ చేసి బాధితులకు శుక్రవారం రాత్రి అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ వై.సతీష్ వెల్లడించారు. సెల్‌ఫోన్స్‌ను రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన కానిస్టేబుల్స్ గౌస్‌పాషా, వీరేందర్‌ను సీఐ ప్రత్యేకంగా అభినందించారు.



సీకేఎం కళాశాల మైదానంలో అంతర్జాతీయ యోగా వేడుకలకు హాజరైన విద్యార్థులు, నగరవాసులు

యోగాతో రోజును ప్రారంభించాలి

త్రిదండి చిన్నజీయర్ స్వామి

పోచమ్మమైదాన్, జూన్ 21 : ప్రతీ ఒక్కరు యోగాతోనే తమ రోజును ప్రారంభించాలని త్రిదండి చిన్నజీయర్ స్వామి అన్నారు. వికాస తరంగిణి ఆధ్వర్యంలో వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం కళాశాల మైదానంలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ యోగా వేడుకలకు ఆయన హాజయర్యారు. తొలుత హాజరైన వారితో యోగాసనాలు చేయించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు స్వతహాగా యోగా పై దృష్టి సారించాలన్నారు. నిరంతరం యోగా చేయడం ద్వారా వ్యాధులు దరి చేరవని, దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బచ్చు రాధాకృష్ణ, డాక్టర్ మురళీకృష్ణ, తుమ్మ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న త్రిదండి చిన్నజీయర్ స్వామి

ఎంజీఎంకు తప్పని విద్యుత్ కష్టాలు



ఎక్స్‌రే విభాగం వద్ద రోగులు

వరంగల్ మెడికల్, జూన్ 21: ఎంజీఎం ఆస్పత్రిలో వైద్య సేవలు పొందేందుకు వచ్చిన రోగులకు విద్యుత్ అంతరాయంతో ఇబ్బందులు తప్పడం లేదు. సాధారణ వార్డులకు విద్యుత్ సరఫరా జరిగితే తప్ప విద్యుత్ ఉండదు. ఎమర్జెన్సీ వార్డుకు జనరేటర్ ద్వారా సరఫరా చేస్తున్నా సకాలంలో సిబ్బంది స్పందించకపోవడంతో అంతరాయం ఏర్పడుతోంది. శుక్రవారం ఎంజీఎం క్యాజువాలిటీ విభాగంలోని ఎమర్జెన్సీ ఎక్స్‌రే విభాగంలో సుమారు గంటపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఎక్స్‌రే సేవలు నిలిచిపోయాయి. అంతేకాకుండా పలు వార్డులకు సైతం కరెంట్ వస్తు పోతూ ఉండటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాజీపేట, జూన్ 21: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాజీపేట ఎస్సై లవన్‌కుమార్ వివరాల ప్రకారం.. హనుమకొండకు చెందిన ఎమ్డీ నజీర్ (47) మార్బుల్ టైల్స్‌లో కూలిపని చేస్తూ జీవిస్తున్నాడు. ఈనెల 17న కాజీపేట నుంచి హనుమకొండకు వెళ్తున్న క్రమంలో ఫాతిమా నగర్ వద్ద ఒక లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడుపుతూ లారీతో నజీర్‌ను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో నజీర్‌కు తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలపాలైన అతడిని స్థానికులు చికిత్స నిమిత్తం 108లో ఎంజీఎంలో చేర్పించారు. చికిత్సపొందుతూ శుక్రవారం మృతి చెందాడు. నజీర్ భార్య అంజుమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉంది.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

వడ్డెపల్లి, జూన్ 21: రాష్ట్రప్రభుత్వం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ అధ్యయన కేంద్రంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సివిల్ సర్వీస్ ఆప్టిట్యూడ్ టెస్ట్ 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశానికి సంబంధించి నిర్వహించే ప్రిలిమినరీ పరీక్షకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల నుంచి దరఖాస్తు ఆహ్వానిస్తోంది. డిగ్రీ ఉత్తీర్ణులై వార్షిక ఆదాయం రూ.3 లక్షలు మించకుండా ఉన్నవారు అర్హులు. జూలై 10వ తేదీలోపు tsstudycircle.co.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ గౌరవ సంచాలకులు డాక్టర్ కె.జగన్ మోహన్ సూచించారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

లెక్చరర్ల భర్తీ కోసం దరఖాస్తుల ఆహ్వానం

వడ్డెపల్లి, జూన్ 21: తెలంగాణ మైనారిటీల గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న జూనియర్ లెక్చరర్ పోస్టులను ఔట్ సోర్సింగ్ పద్ధతి ద్వారా భర్తీ చేయనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మేన శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ లెక్చరర్ల పోస్టులు తెలుగు, భౌతికశాస్త్రం, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రంతోపాటు పీజీటీ ఆంగ్లంలో అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 22 నుంచి 25 వరకు సాయంత్రం 4 గంటల లోపు జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని పేర్కొన్నారు. వివరాలకు సెల్ నంబర్ : 80749 94073లో సంప్రదించాలని కోరారు.

జూలై 1 నుంచి ఎస్డీఎల్‌సీఈ సైకాలజీ పరీక్షలు

కేయూ క్యాంపస్, జూన్ 21: కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం ఎంఎస్సీ సైకాలజీ ఫైనల్ ఇయర్-2023 వార్షిక పరీక్షలు జూలై 1 నుంచి నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్.నరేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 1, 3, 5, 8 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. వర్సిటీ క్యాంపస్‌లోని ఎడ్యుకేషన్ కళాశాలలో పరీక్షల కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. జూలై 9 నుంచి 14 వరకు ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 మొదటి సెషన్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్‌లో ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని గ్రూపుల వారిగా కేటయించిన సమయంలో పరీక్షలకు హాజరుకావాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కేయూ దూరవిద్య కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.



గణపురం మండలం బస్వరాజుపల్లి గ్రామంలో పత్తి విత్తనాలు వేయగా వర్షం లేని కారణంగా మొలకెత్తకపోవడంతో నీళ్లు పోస్తున్న రైతు కుటుంబం

చూస్తూ ఉండలేక..

కరుణ చూపని వరుణుడు.. వానల కోసం ఎదురుచూస్తున్న రైతులు

వర్షాలు ఊరిస్తున్నాయి. అడపాదడపా జల్లులు తప్ప సరైన వానలు లేకపోవడంతో వానాకాలం సాగు పనులు ముందుకు సాగడం లేదు. సాధారణంగా ఏటా జూన్ మొదటి వారంలోనే వర్షాలు ఆరంభమై సమృద్ధిగా కురిసేవి. కానీ, ఈ ఏడాది జూన్ ముగుస్తున్నా ఇంకా సరైన వర్షాలు పడటంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ఇప్పటికే చాలామంది రైతులు దుక్కులు దున్ని విత్తనాలు వేయగా వానలు లేక అవి మొలకెత్తే పరిస్థితి కనిపించడం లేదు. మొలకెత్తినవి కూడా వడబడుతున్నాయి. దీంతో వాటిని కాపాడుకునేందుకు రైతులు ప్రయత్నాలు చేస్తున్నారు. ట్యాంకులు, బిందెలతో నీటిని అందించేందుకు ప్రయత్నిస్తున్నారు. భూపాలపల్లి జిల్లాలోని పలుప్రాంతాల్లో శుక్రవారం పలువురు రైతులు ఇలా మొక్కలకు నీరు పోయడం కనిపించింది.

ఫొటో : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, భూపాలపల్లి

వీవీ ప్యాట్ల పరిశీలన

వరంగల్ కలెక్టరేట్, జూన్ 21: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శుక్రవారం వరం గల్ ఏనుమాముల మార్కెట్ యార్డు గోడౌన్‌లోని వీవీ ప్యాట్లను కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన జిల్లా వేర్‌హౌస్‌లో భద్రంగా ఉన్న వీవీ ప్యాట్లను వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో పేపర్ రోల్స్ అడ్రస్ ట్యాగ్‌లను తొలగించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఎన్నికల పర్యవేక్షకులు విశ్వనారాయణ, నాయబ్ తహసీల్దార్ రంజిత్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



వీవీ ప్యాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్య శారదాదేవి

ఘనంగా యోగా దినోత్సవం

మట్టెవాడ, జూన్ 21: నగరంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా వరంగల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో సీఏ భగవాన్‌దాస్ ముందడ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని హంటర్ రోడ్డులోని బ్రాంచ్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా యోగా గురు, సీఏ రామా శ్రీనివాస్ విచ్చేసి మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. యోగాతో వ్యక్తి జీవన వికాసం మారిపోతుందని, ఆలోచన తీరులో సైతం మార్పు వస్తుందని తెలిపారు. అనంతరం యోగాలో శిక్షణ ఇచ్చారు. బ్రాంచ్ వైస్ చైర్మన్, కోశాధికారి సత్యనారాయణ పూజారి, కార్యదర్శి ఎం.సుజిత్, స్టూడెంట్స్ అసోసియేషన్ చైర్మన్ మన్నెం రామకృష్ణ, సీఏలు రాజు కొయ్యల, వినీల్, బాల్నె భగవాన్, సీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

● వరంగల్ సిటీ : నగరంలోని 19వ డివిజన్ వివేకానందకాలనీలోని బాలజ్యోతి హైస్కూల్‌లో కరస్పాండెంట్ పి.చక్రపాణి ఆధ్వర్యంలో యోగా వేడుకలు నిర్వహించారు. శ్రీమేధ యోగా కోచ్ వై.మహేశ్వర్‌రావు విద్యార్థులకు యోగా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ చక్రపాణి మాట్లాడుతూ.. స్కూల్‌లో యోగా శిక్షణ తరగతులు రెగ్యులర్‌గా జరుగుతాయని, గత పదేళ్లుగా విద్యార్థులకు యోగాలో శిక్షణ ఇప్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● పోచమ్మమైదాన్ : వరంగల్ కొత్తవాడలోని ఇన్నర్‌వీల్ కమ్యూనిటీ హాల్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రముఖ యోగా గురువు డాక్టర్ సీహెచ్.మహేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పతంజలి మహర్షి చిత్ర పటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం పలువురు యోగాసనాలతో అలరించారు.

● గిర్మాజీపేట : ప్రతి రోజు చదువుతో పాటు అర్ధగంట పాటు విద్యార్థులు యోగా చేయాలని జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి కె.సుభాష్ అన్నారు. వరంగల్‌లోని కృష్ణకాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వాసవి క్లబ్ వరంగల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు గంపా అశోక్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యోగా టీచర్ సుబ్బారావు 400 మంది విద్యార్థులతో వివిధ యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా అధికారి సుభాష్ మాట్లాడుతూ నిత్యం యోగా చేయడం ద్వారా మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండటంతో పాటు ఏకాగ్రతను పెంచుకుని ఆరోగ్యంతో ఉండవచ్చని అన్నారు. కార్యక్రమంలో వరంగల్ వాసవి క్లబ్ గవర్నర్ గంపా సాంబమూర్తి, కార్యదర్శి పల్లె వీరన్న, క్లబ్ ప్రతినిధులు జి.సత్యనారాయణరావు, ఎం.సుధాకర్, కిషోర్, శ్రీనివాసులు, లింగమూర్తి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ బండి సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే గిర్మాజీపేట బొడ్రాయి ప్రాంతంలోని గోమతి పబ్లిక్ స్కూల్‌లో కరస్పాండెంట్ కూచన క్రాంతికుమార్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. యోగా గురువు అప్పం భాస్కర్ చిన్నారులతో చేయించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

● ఖిలావరంగల్ : శ్వాస, ధ్యాస ద్వారానే మానవుడిలో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆర్యా బాలుర ప్రభుత్వ సహాయక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉప్పునూతుల రవి అన్నారు. ఖిలావరంగల్ మధ్యకోటలోని ఆర్యా పాఠశాలలో విద్యార్థులకు బెల్లంకొండ పూర్ణచందర్ అధ్యక్షతన యోగాసనాలను నేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా మన ప్రాచీన సంప్రదాయం నుంచి లభించిందన్నారు. యోగా అనేది ఒక సంపూర్ణ జీవన విధానమని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరునగిరి నరేందర్, డి.శ్యాంసుందర్, తోట భిక్షపతి, బి.పూర్ణచందర్, ఎం.వనోజ్, ఉషారాణి, సునీత, సుజాత, జ్యోత్స్న, విద్యార్థులు పాల్గొన్నారు.

● సంగెం : మామునూరు టీఎస్ఎస్‌పీ ఫోర్త్ బెటాలియన్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ శివప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యుల సహకారంతో బెటాలియన్ పోలీసులతో యోగా చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు కృష్ణప్రసాద్, శ్రీనివాస్, వీరన్న, ఆర్ఐలు శోభన్, పురుషోత్తం రెడ్డి, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, అశోక్, కృష్ణ, పోలీసు అధికారులు పోలీసు కానిస్టేబుల్ శిక్షణార్థులు తదితరులు పాల్గొన్నారు. మామునూరు పోలీసు శిక్షణ కళాశాలలో పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ ముఖ్య అతిథిగా హాజరై యోగాను ప్రారంభించారు. పీటీసీ పోలీసులతో యోగా చేయించారు. యోగా మాస్టర్ విజయ్ శ్రీనివాసచారి ద్వారా ప్రిన్సిపాల్ పూజతోపాటు పోలీసు అధికారులు, మహిళా పోలీసు శిక్షణార్థులు వివిధ ఆసనాలు వేశారు. కార్యక్రమంలో పోలీసు శిక్షణ కళాశాల డీఎస్పీలు రవీందర్, సతీష్, భిక్షపతి, ఆర్ఐలు చంద్రశేఖర్, నవీన్, మహేష్, సీఎల్ఐలు రమేష్ రాజ్యలక్ష్మి, ఏఎల్ఐ రాజన్‌బాబు, పీటీసీ యూనిట్ ఆస్పత్రి వైద్యాధికారి సుధీర్, డాక్టర్ చంద్రశేఖర్ ఆర్యా, పోలీసులు పాల్గొన్నారు.

ఖిలావరంగల్ మండలం తిమ్మాపురం హవేలి గ్రామంలోని ప్రజ్ఞా ప్లేవే ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మిద్దెపాక ఎల్లయ్య, ఉపాధ్యాయులు కావ్య, సుమతి, సులోచన, అనూష తదితరులు పాల్గొన్నారు.

● గీసుగొండ : మండలంలోని పలు పాఠశాలల్లో యోగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులచే ప్రత్యేక యోగాసనాలను చేయించారు. శ్వాస మీద ధ్యాస ఉంచడమే యోగా అని విద్యార్థులకు యోగా టీచర్లు వివరించారు. యోగాసనాల పద్ధతులను, వాటి ఉపయోగాల గురించి వివరించారు. కాగా, ధర్మారం వద్ద గల బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన యోగా వేడుకల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఘంటా రవికుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, నాయకులు డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, రాదారపు శివకుమార్, గట్టికొప్పుల రాంబాబు, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, క్రాంతికుమార్, అశ్వినికుమార్ తదితరులు పాల్గొన్నారు.

● కరీమాబాద్ : కరీమాబాద్‌లోని న్యూకౌటిల్యాస్ సెయింట్ ఆమన్ హైస్కూల్‌లో విద్యార్థులు ప్రదర్శించిన యోగాసనాలు అలరించాయి. పాఠశాలలో నిర్వహించిన యోగా దినోత్సవంలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. కరస్పాండెంట్ కోడం శ్రీధర్ మాట్లాడుతూ ప్రతీ రోజు ఉదయం వేళలో ఒక గంట పాటు యోగాసనాలు వేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కోడం సబిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● శంభునిపేట : ఒడిదుడుకులు, ఒత్తిడిని అధిగమించి ఆరోగ్యవంతమైన జీవితాన్ని యోగాతోనే పొందవచ్చని బీజేపీ నాయకుడు కర్నె రవీందర్ అన్నారు. 41వ డివిజన్ విశ్వనాథకాలనీలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వాగ్భట యోగా సంఘం ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పెరుమాండ్ల మధు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ యోగా గురువు పాకాల చంద్రశేఖర్‌రావు, డాక్టర్ అనంతుల అన్వేష్ పాల్గొని యోగాసనాలు వేయించారు. బీజేపీ 42వ డివిజన్ అధ్యక్షుడు తాళ్ళపల్లి అర్జున్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యోగా వేడుకలు నిర్వహించారు. అలాగే రంగశాయిపేట లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో జరిగిన వేడుకల్లో విద్యార్థులు పలు ఆసనాలు వేసి అబ్బురపరిచారు. ముఖ్య అతిథిగా జాతీయ ఒలంపిక్ అసోసియేషన్ కోశాధికారి భైరబోయిన కైలాస్ యాదవ్ పాల్గొని యోగా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శేర్ల అనిల్‌కుమార్ పాల్గొన్నారు. అరవింద పబ్లిక్ స్కూల్‌లో కరస్పాండెంట్ పంచకం నర్సయ్య ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. విజన్ హైస్కూల్‌లో ప్రిన్సిపల్ విలాసాగరం విశ్వనాథం ఆధ్వర్యంలో యోగా వేడుకలు నిర్వహించారు.



ఫోర్త్ బెటాలియన్‌లో యోగా చేస్తున్న కమాండెంట్ శివప్రసాదరెడ్డి, పోలీసులు



పోలీసులతో యోగా చేస్తున్న పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ



నగరంలోని కృష్ణకాలనీ ప్రభుత్వ హైస్కూల్‌లో యోగా చేస్తున్న విద్యార్థులు



మధ్యకోటలోని ఆర్య బాలుర ఉన్నత పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు



ధర్మారంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో యోగాసానాల్లో పాల్గొన్న రవికుమార్



కరీమాబాద్‌లోని న్యూకౌటిల్యాస్ సెయింట్ ఆమన్ హైస్కూల్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



హంటర్ రోడ్డులోని ఐసీఏఐ వరంగల్ బ్రాంచ్‌లో యోగాలో పాల్గొన్న సీఏలు

బంగారం చోరీ కేసులో పురోగతి ఏదీ?

▸▸ **పోలీసుల తీరుపై వ్యాపారస్తుల్లో చర్చ**

మట్టెవాడ, జూన్ 21 : వరంగల్ మట్టెవాడ పోలీసు స్టేషన్ పరిధిలోని విశ్వకర్మ వీధిలో వారం రోజుల క్రితం జరిగిన 80 తులాల బంగారం చోరీ కేసుపై పోలీసులు ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి సాధించలేదు. ఈనెల 14న సాయంత్రం చోరీ జరిగిన వెంటనే బంగారం దుకాణం యజమాని మానె సంజయ్‌తో పాటు విశ్వకర్మ వీధిలోని కొందరు బంగారు వ్యాపారస్తులతో కలిసి మట్టెవాడ పోలీసు స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ కేసుపై ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు బంగారం చోరీపై దర్యాప్తును ప్రారంభించటంలో జాప్యం చేశారని వ్యాపారస్తులు వాపోతున్నారు. చోరీ జరిగిన వెంటనే పోలీసులు స్పందించి నగరంలోని సీసీ పుటేజీలను పరిశీలించి ప్రత్యేక తనిఖీలు చేపట్టడం, మహారాష్ట్రకు వెంటనే ప్రత్యేక పోలీసు బృందాన్ని పంపితే నిందితుడి ఆచూకీతో పాటు చోరీకి గురైన 80 తులాల బంగారం దొరికే అవకాశం ఉండేదని వ్యాపారస్తుల్లో చర్చ జరుగుతోంది. చోరీ కేసులో అనుమానితుడిగా ఉన్న సురేష్ తన సోదరి ఇంటికి వెళ్లాడు. దీంతో మహారాష్ట్రలోని భాగ్యనగర్ గ్రామానికి 17న వెళ్లడంతో అప్పటికే నిందితుడు అక్కడి నుంచి పారిపోయినట్లు తెలిసింది. దీంతో మహారాష్ట్రకు వెళ్లిన ప్రత్యేక పోలీసులు గురువారం రాత్రి వరంగల్‌కు తిరిగివచ్చారు. బంగారు చోరీ అయిన దుకాణంలోనే పనిచేస్తున్న నిందితుడిని గుర్తించి పట్టుకోవడంలో పోలీసులు విఫలం చెందారని చర్చ వినిపిస్తోంది. చోరీ కేసులో నిందితుడిని పట్టుకోవడం కోసం మహారాష్ట్ర పోలీసుల సహకారం తీసుకునే విషయంలో మట్టెవాడ పోలీసులు వెనుకడుగు వేస్తున్నారని తెలుస్తోంది.

రంగంలోకి సీసీఎస్ పోలీసులు

వరంగల్ విశ్వకర్మ వీధిలో బంగారం చోరీ జరిగి వారం రోజులు గడిచినప్పటికీ నిందితుడిని పట్టుకోవడంలో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో పోలీసు ఉన్నతాధికారులు వరంగల్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసులను రంగంలోకి దింపినట్లు తెలిసింది. సీసీఎస్ పోలీసులు చోరీ జరిగిన విధానాన్ని పరిశీలించి దర్యాప్తును ప్రారంభించారు.

సీసీ కెమెరాల వైర్లు కట్ చేసి చోరీ..

ఈ నెల 14న విశ్వకర్మ వీధిలో ఓం బులియన్ షాపులో పనిచేస్తున్న సురేష్ అనే వ్యక్తి చోరీ సమయంలో ముందే సీసీ కెమెరాల వైర్లను కట్ చేసి బంగారాన్ని దొంగలించినట్లు తెలిసింది. షాపు కౌంటర్‌లోని బంగారాన్ని వెంటనే అపహరించి పారిపోయినట్లు సమాచారం. ఈ చోరీ కేసులో అనుమానితుడిగా ఉన్న సురేష్ గతంలో మహారాష్ట్రలోని ఓ బంగారం షాపులో బంగారం చోరీ చేసినట్లు మహారాష్ట్రకు చెందిన బంగారం వ్యాపారస్తుల ద్వారా తెలుసుకున్నట్లు వరంగల్ వ్యాపారస్తులు చెబుతున్నారు.

ఎంపీ రవిచంద్ర పెళ్లిరోజు వేడుకలు

మట్టెవాడ, జూన్ 21: వరంగల్ పోచమ్మమైదాన్ జంక్షన్‌లో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర-విజయలక్ష్మి దంపతుల పెళ్లిరోజు వేడుకలను వద్దిరాజు రవిచంద్ర యువసేన, బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సుమారు 300 మందికి ఆలుబిర్యానీ, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సదాంత్, తాళ్లపెల్లి రమేశ్, పుష్పతలయ, సిరిమల్ల కిరణ్, ఏరుకొండ వినయ్, నాగపురి రమేశ్, జనగామ మణికంఠ, షారు, మాజ్, సంతోష్, చిన్న, శ్రీనివాస్, ప్రశాంత్, మధు, క్రాంతి పాల్గొన్నారు. అలాగే కాశిబుగ్గ సొసైటీ కాలనీలోని మదర్ థెరిస్సా ఆశ్రమంలో వద్దిరాజు రవిచంద్ర యువసేన ఆధ్వర్యంలో మానసిక వికలాంగులచే కేక్ కట్ చేయించి అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువసేనన సభ్యులు పాల్గొన్నారు.



పోచమ్మమైదాన్ సెంటర్‌లో అన్నదాన కార్యక్రమం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జూడోలో సత్తా చాటిన గుడిబడి విద్యార్థులు

● **భోపాల్ టోర్నమెంట్స్‌లో బంగారు, రజత, కాంస్య పతకాలు కైవసం**

వరంగల్ సిటీ, జూన్ 21: మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరుగుతున్న ఆల్‌ఇండియా ఇంటర్ స్థాయి జూడో టోర్నమెంట్స్‌లో వరంగల్ నగరంలోని నరేంద్రనగర్(గుడిబడి) పాఠశాల విద్యార్థులు పాల్గొని పలు పతకాలు సాధించి జాతీయ స్థాయిలో సత్తా చాటినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.వెంకటేశ్వర్‌రావు తెలిపారు. పాఠశాల నుంచి పది మంది విద్యార్థులు టోర్నమెంట్స్‌లో పాల్గొనగా శుక్రవారం జరిగిన పోటీల్లో ఒక బంగారు, ఒక రజత, ఆరు కాంస్య పతకాలు సాధించారని అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ సెంటర్లలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. 35 కేజీల విభాగంలో అజ్మీర అక్షయ్(గోల్డ్‌మెడల్), 32 కేజీల బాలికల విభాగంలో వి.సిరిచందన(సిల్వర్ మెడల్) గెలుపొందారు. 40 కేజీల బాలుర విభాగంలో కె.జయవర్ధన్, 45 కేజీల విభాగంలో ఎం.సందేశ్, 55 కేజీల విభాగంలో హరిహరణ్, 32 కేజీల బాలికల విభాగంలో జి.గాయిత్రి, 36 కేజీల విభాగంలో ఎస్.మనస్విని, 40 కేజీల విభాగంలో ఎం.వైష్ణవి బ్రాంజ్ మెడల్స్ గెలుపొందారు. కాగా, శనివారం జరగాల్సిన 55 కేజీల విభాగంలో మరో విద్యార్థిని ఎం.మహల్య పాల్గొనాల్సి ఉందని చెప్పారు. ఈ పతకాలు రావడానికి కృషి చేసిన పీడీ వై.నారాయణ, కోచ్ లింగమూర్తిలను అభినందించినట్లు ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్‌రావు తెలిపారు.



భోపాల్‌లో పతకాలు సాధించిన విద్యార్థులతో పీడీ నారాయణ

గంగదేవిపల్లిని సందర్శించిన సత్యసాయి జిల్లా వీడీఎల్‌లు

గీసుగొండ, జూన్ 21: మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామమైన గంగదేవిపల్లిని ఆంధ్రప్రదేశ్‌లోని సత్యసాయి జిల్లా తలుపుల మండలంలోని 11 గ్రామాల నుంచి 40 మంది విలేజ్ డెవలప్‌మెంట్ లీడర్లు రాయలసీమ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా లీడర్ల బృందానికి గ్రామాభివృద్ధి కమిటీల పనితీరు, సాధించిన జాతీయ స్థాయి అవార్డులు, అభివృద్ధిలో ప్రజల స్వచ్ఛంద భాగస్వామ్యం గురించి జిల్లా ట్రెయినింగ్ మేనేజర్ కూసం రాజమౌళి వివరించారు. అవార్డుల ద్వారా రూ.11.48లక్షల నగదు లభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు శ్రీనివాస్, ధనలక్ష్మి, లక్ష్మణ్, రిసోర్స్ పర్సన్స్ మేడిద సుశీల, గూడ సరోజన తదితరులు పాల్గొన్నారు.



గంగదేవిపల్లిని సందర్శించిన సత్యసాయి జిల్లా వీడీఎల్‌లు

పెన్షనర్లకు కరువు భత్యం విడుదల చేయాలి

అసోసియేషన్ రాష్ట్ర సలహాదారు నర్సింహారెడ్డి

పోచమ్మమైదాన్, జూన్ 21: పెన్షనర్లకు బకాయిపడిన నాలుగు కరువు భత్యం వాయిదాలను వెంటనే విడుదల చేయాలని పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర సలహాదారు ఇ.నర్సింహారెడ్డి అన్నారు. వరంగల్ కొత్తవాడలోని ఇన్నర్‌వీల్ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ వరంగల్ జిల్లా తృతీయ సర్వసభ్య సమావేశం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పెన్షనర్లకు కార్పొరేట్ ఆస్పత్రులలో నగదు రహిత చికిత్స వర్తింపచేయాలని, ఇంటీరియం రిలీఫ్‌ను 20 శాతానికి పెంచాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంపీ నర్సింగరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెలిశోజు రామ మనోహర్, జిల్లా అధ్యక్షుడు కర్రు సుధీర్‌బాబు, నర్సయ్య, పురుషోత్తం, జగన్ మోహన్, అలువాల సూర్యనారాయణ, అంజయ్య, బాల మల్లేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర సలహాదారు నర్సింహారెడ్డి

ఆర్థికాభివృద్ధిలో పొదుపు కీలకం

(3వ పేజీ తరువాయి)

చార్‌బౌళి పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం వరంగల్ మోడల్ కూరగాయల మార్కెట్ వ్యాపారుల తెలంగాణ పొదుపు, మార్కెటింగ్, పరస్పర సహాయక సహకార సంఘం అధ్యక్షుడు బిట్ల కృష్ణ అధ్యక్షతన జరిగిన సంఘం తొలి వార్షికోత్సవంలో రవిందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పొదుపు, పరస్పర సహాయం లక్ష్యంగా కూరగాయల మార్కెట్ వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న ఈ సంఘం సభ్యుల సమష్టితో అభివృద్ధి చెందుతూ సభ్యుల ఆర్థికాభివృద్ధిలో దిక్సూచిలా ఉండాలని అన్నారు. మోడల్ కూరగాయల మార్కెట్ వ్యాపారుల సమస్యల పరిష్కారంలో తన సహకారం ఎల్లప్పుడు ఉంటుందని తెలిపారు. జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి మాట్లాడుతూ ఈ సంఘం బలోపేతానికి మ్యాచింగ్ గ్రాంటుతో పాటు ప్రభుత్వ సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. సంఘం అధ్యక్షుడు బిట్ల కృష్ణ మాట్లాడుతూ మోడల్ కూరగాయల మార్కెట్ వ్యాపారుల సంక్షేమమే లక్ష్యంగా ఏర్పాటు చేసుకున్న ఈ సంఘం సభ్యుల సహకారంతో తొలి వార్షికోత్సవం జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. సంఘం అభివృద్ధికి కృషి చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు, సంఘం సభ్యులు పాపని భాస్కర్, సామల రాజు, సూరయ్య, మురళి, ప్రకాష్, శేఖర్, మహేష్, హరి తదితరులు పాల్గొన్నారు.



'నీట్ విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం'

నర్సంపేట, జూన్ 21 : నీట్ విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటాలు కొనసాగిస్తామని విద్యార్థి సంఘాల నాయకులైన ఎస్ఎస్‌యూఐ అధ్యక్షుడు జయ్యారపు అఖిల్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు దిడ్డి పార్థసారది, ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ అన్నారు. పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద శుక్రవారం ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ పరీక్షను సజావుగా నిర్వహించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. బీజేపీ పాలిత రాష్ట్రంలో నీట్ పరీక్ష పపేర్ లీక్ జరిగినా కేంద్రం పట్టించుకోకపోవడం సరైందికాదన్నారు. నీట్ పరీక్షను రద్దుచేసి మళ్లీ నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి గుర్రం అజయ్, ఎన్ఎస్‌యూఐ పట్టణ అధ్యక్షుడు కటారి ఉత్తమ్‌కుమార్, ఎన్‌డీ నాయకులు ఇమ్మడి రంజిత్, దూపటి రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

జయశంకర్ సార్‌కు ఘన నివాళి



ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నర్సంపేట, జూన్ 21 : తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి కార్యక్రమాలను శుక్రవారం నర్సంపేట పట్టణంలో బీఆర్ఎస్ పట్టణ, మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ పట్టణ కమిటీ అధ్యక్షుడు నాగెల్లి వెంకట నారాయణగౌడ్, మండల కమిటీ అధ్యక్షుడు నామాల సత్యనారాయణ, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహరాములు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తుదిశ్వాస విడిచే వరకు పోరాడిన ప్రొఫెసర్ జయశంకర్ సేవలు మరువలేనివన్నారు. ఆయన ఆశయ సాధనకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బండి రమేశ్, కౌన్సిలర్ దేవోజు తిరుమల సదానందం, పట్టణ ప్రధానకార్యదర్శి మండ ల శ్రీనివాస్, బీరం నాగిరెడ్డి, నాయిని వేణు. మద్దెల సాంబయ్య, నాగరాజు, పల్నాటి సందీప్ తదితరులు పాల్గొన్నారు. విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. జయ శంకర్ చిత్రపటానికి విశ్వకర్మ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కురిమిల్ల సుదర్శనాచారి, పట్టణ మాజీ అధ్యక్షుడు దేవోజు సదానందం, వెంకటేశ్వర్లు, శ్రీరామోజు మురళి, కృష్ణమూర్తి, నరసింహచారి, భాస్కరా చారి, భద్రాచారి, అభినాష్, రవీంద్రచారి, జనార్ధన్, సతీష్, మాధవచారి దేవోజు హేమంత్ పాల్గొన్నారు.

• రాయపర్తి : తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యానాయక్, మండలపార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎండీ అఫ్రోజ్, గుగులోతు శ్రీనివాస్, మచ్చ రమేష్,సమ్మయ్య, గబ్బెట బాబు, నర్సయ్య, వెంకన్న, రాంమూర్తి పాల్గొన్నారు.

• ఖానాపురం: ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి కార్యక్రమాలను మండలవ్యాప్తంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, ఎంపీడీవో భారతి జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, సొసైటీ డైరెక్టర్ రాజు, పైండ్ల యాదగిరి, మక్క రాములు, బాలునాయక్, పూలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

• నల్లబెల్లి : మండలంలో ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. మండల కేంద్రంలోని జీపీ ఆవరణలో జయశంకర్ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు.సామాజికవేత్త భట్టు సాంబయ్య మాట్లాడుతూ.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం అవిశ్రాంతంగా పోరాడిన యోధుడు ప్రొఫెసర్ జయశంకర్ అన్నారు. కార్యక్రమంలో నాయకులు పరికి నవీన్, పొడేటి కిషోర్, నత్తి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పర్వతగిరి, జూన్ 21: మండలకేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో ప్రవేశాలకు గాను దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు హాస్టల్ వార్డెన్ కంజర్ల రవికుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హాస్టల్‌లో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఎస్సీ విద్యార్థులకు 75 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇతర పాఠశాలల్లో చదువుకునే ఎస్సీ విద్యార్థులకు హాస్టల్‌లో వసతిసౌకర్యం కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు కె.రవికుమార్ 9848920914 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



నర్సంపేటలో యోగాసనాలు వేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



ఉప్పరపెల్లిలో యోగా చేస్తున్న ఎంపీడీవో వెంకటరమణ

అంతర్జాతీయ యోగా దినోత్సవంలో వక్తలు

నర్సంపేట టౌన్, జూన్ 21 : నర్సంపేట మండలం, పట్టణంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నర్సంపేట పట్టణంలోని బాలాజీ పాఠశాలలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. బాలాజీ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎ. రాజేంద్రప్రసాద్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ యోగాతో ప్రతీ ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనాన్ని గడుపుతారన్నారు.కార్యక్రమంలో డాక్టర్ వనజ, ఏవో సురేష్, ప్రిన్సిపాల్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని విజ్‌డమ్ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జావెద్, కరస్పాండెంట్ జహంగీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో కేఎస్ఆర్ కాన్సెప్ట్ స్కూల్‌లో నిర్వహించిన యోగావేడుకల్లో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్,శశికుమార్, దీపక్ పాల్గొన్నారు. నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్, ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో యోగా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ శివనాగ శ్రీను, డాక్టర్ రమేష్, సత్యనారాయణ, టి. రమేష్, విష్ణుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

• వర్ధన్నపేట : అంతరాతీఈయ యోగా దినోత్సవ వేడుకలు వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ పాఠశాలలో ఉదయం 7 గంటలకే ఎన్‌సీసీ క్యాడెట్లతో యోగా కార్యక్రమాన్ని చేపట్టారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.సదానందం మాట్లాడుతూ నిత్యం జీవితంలో యోగా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ మనుజేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఆర్.అనిల్, కుమారస్వామి, వంశీమోహన్, రాజేశ్వర్‌రావు, దేవయ్య తదితరులు పాల్గొన్నారు. పట్టణ కేంద్రంలోని ఆల్ఫోర్స్ పాఠశాలలో యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధిపతి డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

• వర్ధన్నపేటరూరల్ : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని వర్ధన్నపేట ఎంపీడీవో వెంకటరమణ తెలిపారు. మండలంలోని ఉప్పరపెల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో యోగా శిక్షకుడు వీరస్వామి ఆధ్వర్యంలో విద్యార్థులు పలు ఆసనాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో యోగాలో రాణిస్తూ జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎదిగేలా చేయడంపై వీరస్వామిని అభినందించారు. ఇల్లందలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వన్నాల వెంకటరమణ ఆధ్వర్యంలో యోగాచేశారు. కట్య్రాల ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎం శ్రీధర్ ఆధ్వర్యంలో విద్యార్థులు యోగా చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వేణు, కార్యదర్శి దేవేందర్, ఉపాధ్యాయులు ఉషారాణి, రమాదేవి, సదానందం, జిల్లా ఉపాధ్యక్షుడు నాంపెల్లి యాకయ్య, సామాజిక కార్యకర్త మోడెం కుమారస్వామి, యోగాశిక్షకుడు జోగుల ఎల్లస్వామి పాల్గొన్నారు.

• నెక్కొండ: దైనందిన జీవితంలో ఒత్తిడికి దూరంగా ఉండేందుకు యోగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, యోగాతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మండలంలోని రెడ్లవాడ రూరల్ డెవలప్‌మెంట్ స్కూల్ హెడ్మాస్టర్ చేరాలు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం పాఠశాలల్లో విద్యార్థులతో యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

• నల్లబెల్లి : మండలంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రామాలయంలో మండల బీజేపీ నాయకులు యోగాసనాలు చేశారు. మండలఅధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. జూన్ 21న ఉత్తరార్ధగోళంలో పగలు సమయం ఎక్కువ కాబట్టి అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించాలని ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమా వేశంలో భారతదేశ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రతిపాదించారని, దీంతో 193 మంది ఐక్యరాజ్య సమితి ప్రతినిధుల్లో 175మంది మద్దతు తెలిపారన్నారు. అప్పటి నుంచి జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తడుక వినయ్ గౌడ్, సుధాగాని ప్రమోద్‌గౌడ్, నాగిరెడ్డి, రాజిరెడ్డి, ఈర్ల నాగరాజు, రవి, షైబు పాల్గొన్నారు.

• దుగ్గొండి : యోగా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులచే యోగా చేయించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రామాస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లి జిల్లా పరిషత్ పాఠశాల, మండల కేంద్రంలోని సిద్దార్థ హై స్కూల్, మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో గోవిందరాజులతో పాటు పలువురు అధికారులు యోగా చేశారు. ఉప్పరపల్లి పాఠశాల విద్యార్థులు యోగా అక్షరాల అకారంలో కూర్చొని వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం అండెం కర్ణాకర్‌రెడ్డి, యోగా గురువు వీరాచారి. సూపరింటెండెంట్ దయాకర్ పాల్గొన్నారు.

• సంగెం : మామునూరు టీఎస్ఎస్‌పీ ఫోర్త్ బెటాలియన్‌లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ శివ ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమానికి ది ఆర్ట్ ఆఫ్ లీవింగ్ సభ్యుల సహకారంలో బెటాలియన్ పోలీసులతో యోగా చేయించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెట్లు కృష్ణ ప్రసాద్, శ్రీనివాస్, వీరన్న, ఆర్ఐలు శోభన్, పురుషోత్తం రెడ్డి, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, పోలీసు అధికారులు పోలీసు కానిస్టేబుల్ శిక్షణార్థులు పాల్గొన్నారు. మామునూరు పోలీసు శిక్షణ కళాశాలలో పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ ముఖ్య అతిథిగా యోగాను ప్రారంభించారు. పీటీసీ పోలీసులతో యోగా చేయించారు. కార్యక్రమంలో పోలీసు శిక్షణ కళాశాల డీఎస్పీలు రవీందర్, సతీష్, భిక్షపతి, ఆర్ఐలు చంద్రశేఖర్, నవీన్, మహేష్, సీఎల్ఐలు రమేష్ రాజ్యలక్ష్మీ, ఏఎల్ఐ రాజన్‌బాబు, పీటీసీ యూనిట్ ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ సుధీర్, డాక్టర్ చంద్రశేఖర్ ఆర్యా యోగా మాస్టార్ విజయ్, పోలీసులు, మహిళా పోలీసు శిక్షణార్థులు పాల్గొన్నారు. ఖిలావరంగల్ మండలం తిమ్మాపురం హవేలిలోని ప్రజ్ఞా ప్లే వే ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మిద్దెపాక ఎల్లయ్య, ఉపాధ్యాయులు కావ్య, సుమతి, సులోచన, అనూష పాల్గొన్నారు.

• పర్వతగిరి : అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శంకర్, ఎంపీవో శ్రీనివాసులు యోగాసనాలను వేశారు. మండల కేంద్రంలోని విశ్వ జెనిత్ పాఠశాలలో ప్రిన్సిపాల్ ఎర్రబెల్లి హరికుమార్, విజ్‌డమ్ పాఠశాలలో ప్రిన్సిపాల్ దేవేందర్ పర్యవేక్షణలో విద్యార్థులు యోగాసనాలను వేశారు.

• గీసుగొండ : మండలంలోని పలు పాఠశాలల్లో యోగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులచే ప్రత్యేక యోగాసనాలను చేయించారు. శ్వాస మీద ధ్యాస ఉంచడమే యోగా అని విద్యార్థులకు యోగా టీచర్లు వివరించారు. యోగాసనాల పద్ధతులను, వాటి ఉపయోగాల గురించి వివరించారు. కాగా, ధర్మారం వద్ద గల బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన యోగా వేడుకల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఘంటా రవికుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, నాయకులు డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, రాదారపు శివకుమార్, గట్టికొప్పుల రాంబాబు, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, క్రాంతికుమార్, అశ్వినికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వృథాగా పోతున్న సాగునీరు

రిజర్వాయర్ తూములతో ఇబ్బందులు పడుతున్న రైతులు

పర్వతగిరి, జూన్ 21 : రైతులకు సాగునీటి సౌకర్యం కోసం నిర్మించిన రిజర్వాయర్‌తో కొందరు రైతులు పడరాని పాట్లుపడుతున్నారు. రిజర్వాయర్ నిర్మించిన అధికారులు వాటి తూములకు షట్టర్లను సరిగా బిగించకపోవడంతో సాగునీరంతా వృధాగాపోతోంది. వృధాగాపోతున్న సాగునీరు దిగువభాగాన ఉన్న దళితరైతుల పొలాల్లోంచి నిరంతరం వెళ్తుండడంతో పంటలు సాగుచేయడానికి గాను వీల్లేకుండాపోతోంది. దీంతో రైతులు తమ పొలాలను వదిలేసి ఇతరుల పొలాల్లోకి కూలీ పనులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం రిజర్వాయర్‌లో నీటిమట్టం తక్కువగా ఉందని, తూముల షట్టర్లను బాగుచేయించి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

శివాలయం ప్రారంభోత్సవం పేరుతో...

మండల కేంద్రంలోని పెదచెరువును గతంలో రిజర్వాయర్‌గా మార్చారు. ఈ క్రమంలో కట్ట కుంగిపోవడంతో రిజర్వాయర్‌కు రిపేర్లు చేశారు. అయినప్పటికీ ఇబ్బందులు తలెత్తడంతో మళ్లీ కొత్త కట్టను నిర్మించారు. నిర్మాణ పనులు జరుగుతుండగానే రిజర్వాయర్ సమీపాన ఉన్న గుట్టపై శివాలయాన్ని నిర్మించారు. శివాలయం ప్రారంభానికి గాను అప్పటి మంత్రులు హరీశ్‌రావు, దయాకర్‌రావు రానుండడంతో గుట్ట పక్కన ఉన్న రిజర్వాయర్‌లో నీటిని నింపి బోటింగ్ ఏర్పాటుచేస్తే ఆహ్లాదంగా ఉంటుందని భావించి అప్పటికప్పుడు హడావిడిగా పనులను పూర్తిచేసి నీటిని నింపారు. దీంతో తూముల షట్టర్లను సరిగా బిగించక పోవడంతో చిన్నగా మొదలైన లీకేజీ పెద్దగా మారి దిగువన ఉన్న పొలాల మీదుగా వెళ్తున్నాయి. దీంతో కింద రైతులు వేసిన పొలాలు నీటమునిగాయి. లీకేజీ నిరంతరం కొనసాగుతుండడంతో రైతులు తమ పొలాల్లో పంటల సాగు చేపట్టలేక పోతున్నారు.

పోలుకమ్మ చెరువు తూము సైతం..

రిజర్వాయర్‌లో నుంచి వృథాగా పోతున్న సాగునీరు దిగువన ఉన్న పోలుకమ్మ చెరువులోకి వెళ్తుంది. ఇది లాఉంటే పోలుకమ్మ చెరువు వద్ద కల్వర్టు నిర్మాణానికి గాను మత్తడి వద్ద ఉన్న తూమును పూర్తిగా మూసివేశారు. తూముఖుఊ మూసివేయడంతో అందులోని నీరు బయటకువెళ్లే అవకాశాలులేక బ్యాక్‌వాటర్ రూపంలో ఇప్పటికేముంపునకు గురవుతున్న దళిత రైతుల పొలాల్లోకి వెళ్తున్నాయి. ఇటు రిజర్వాయర్ నీటితోనే ఇబ్బందులు పడుతున్న రైతులకు పోలుకమ్మ చెరువు బ్యాక్‌వాటర్ సైతం పెద్దసమస్యగా మారాయి. సుమారు 50ఎకరాల మేర పంటలు పండించ కుండా వృథాగా వదిలేయాల్సి వస్తుందని వాపోతున్నారు.



రిజర్వాయర్ నుంచి పోతున్న నీరు

వరదలతో మరింత ప్రమాదం

ప్రస్తుతం వర్షాలు పూర్తిగా ప్రారంభం కాకముందే రిజర్వాయర్ షట్టర్లకు మరమ్మతులు నిర్వహించడం తో పాటు పోలుకమ్మ చెరువు తూమును తెరిపించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో పాటు రిజర్వాయర్ నుంచి పోలుకమ్మ చెరువు వరకు ఉన్న వరదకాలువను సీసీతో నిర్మించాలని కోరుతున్నారు. వర్షాలు ప్రారంభమైతే పనులు చేసే వీలుండదని, ఈలోపే పనులను చేపట్టాలని అంటున్నారు.

అధికారులు దృష్టిసారించాలి

సింగారపు యాకయ్య, రైతు



రిజర్వాయర్ పనులను చేపట్టిన అధికారులు తూములకు షట్టర్లను సరిగా బిగించకపోవడంతో అవి ఇరుక్కుపోయి భారీగా సాగునీరు వృధాగా పోతోంది. ప్రస్తుతం వర్షాలు ప్రారంభం కాకముందే షట్టర్లను తొలగించి మరమ్మతులు చేపట్టి తిరిగి సరైన పద్ధతి లో బిగించాలి. అప్పుడే రైతులకు ఇబ్బందులు తొలగుతాయి. అధికారులు దృష్టిసారించి రైతుల పంటలు పండేవిధంగా చొరవ చూపాలి.

వీవీ ప్యాట్ల పరిశీలన



వీవీ ప్యాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్య శారదాదేవి

వరంగల్ కలెక్టరేట్, జూన్ 21 : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శుక్రవారం వరంగల్ ఏనుమాముల మార్కెట్ యార్డు గోడౌన్‌లోని వీవీ ప్యాట్లను కలెక్టర్ డాక్టర్ సత్యశారదాదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన జిల్లా వేర్‌హౌస్‌లో భద్రంగా ఉన్న వీవీ ప్యాట్లను వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో పేపర్ రోల్స్, అడ్రస్ ట్యాగ్‌లను తొలగించినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఎన్నికల పర్యవేక్షకులు విశ్వనారాయణ, నాయబ్ తహసీల్దార్ రంజిత్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్య



కరుణాకర్ (ఫైల్)

రాయపర్తి, జూన్ 21 : కడుపు నొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఊకల్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన దీకొండ కరుణాకర్(40) కడుపునొప్పి భరించలేక నొప్పి తీవ్రంకావడంతో పురుగుల మందు తాగి ఆత్మ హత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఖాతాదారుల సహకారం మరువలేనిది

వర్ధన్నపేట రూరల్, జూన్ 21 : వర్ధన్నపేట మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు, బ్యాంకు ఖాతాదారుల సహకారం మరువలేనిదని యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఇస్లావత్ నరేష్ అన్నారు. శుక్రవారం ఇల్లందలోని యూనియన్ బ్యాంక్ మేనేజర్ నరేష్ నెక్కొండకు బదిలీపై వెళ్తుండగా స్థానికులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉద్యోగులు శ్రీనివాస్, వంశీకృష్ణ, రమేష్, సురేష్, రాజశేఖర్, స్థానికులు నర్సింహరెడ్డి, కృష్ణారెడ్డి, లింగమూర్తి, మురళీ నాయక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నెక్కొండ, జూన్ 21: నెక్కొండలోని 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిల్లోని 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లలో ఈ నెల 22వ తేది ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నాం 12గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈ నర్సంపేట ఆర్.శ్రీధర్ శుక్రవారం తెలిపారు. ఈ సబ్‌స్టేషన్‌ల పరిధిల్లోని విద్యుత్ స్తంభాలకు దగ్గరగా ఉండి తరచు విద్యుత్ సరఫరాలకు అంతరాయం కలిగిస్తున్న చెట్ల కొమ్మలను తొలగించడంతో పాటు 132/33 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నందున సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన వివరించారు.

• చెన్నారావుపేట : నేడు విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఉంటుందని నర్సంపేట డీఈ శ్రీధర్ అన్నారు. నెక్కొండ సబ్‌స్టేషన్‌లోని 132/33 కేవీలో మరమ్మతు పనులను చేపడతారన్నారు. శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నాం 12 గంటల వరకు మండల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరాపరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించవల్సిందిగా ఆయన కోరారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

పర్వతగిరి, జూన్ 21: పోగొట్టుకున్న స్మార్ట్‌ఫోన్‌ను పోలీసులు కనిపెట్టి బాధితుడికి అప్పగించారు. ఎస్సై గుగులోత్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గడ్డం కుమారస్వామి అనే వ్యక్తి ఏప్రిల్ 27వ తేదీన తన ఐక్యూ మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకోగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను కనిపెట్టి శుక్రవారం బాధితుడికి అందించా రు. ఈకార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వెంకట్రాం, కానిస్టేబుల్ ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధిలో పొదుపు కీలకం

(3వ పేజీ తరువాయి)

చార్‌బౌళి పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం వరంగల్ మాడల్ కూరగాయల మార్కెట్ వ్యాపారుల తెలంగాణ పొదుపు, మార్కెటింగ్, పరస్పర సహాయక సహకార సంఘం అధ్యక్షుడు బిట్ల కృష్ణ అధ్యక్షతన జరిగిన సంఘం తొలి వార్షికోత్సవంలో రవిందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పొదుపు, పరస్పర సహాయం లక్ష్యంగా కూరగాయల మార్కెట్ వ్యాపారులు ఏర్పాటుచేసుకున్న ఈ సంఘం సభ్యుల సమష్టితో అభివృద్ధి చెందుతూ సభ్యుల ఆర్థికాభివృద్ధిలో దిక్సూచిలా ఉండాలని అన్నారు. మాడల్ కూరగాయల మార్కెట్ వ్యాపారుల సమస్యల పరిష్కారంలో తన సహకారం ఎల్లప్పుడు ఉంటుందని తెలిపారు. జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి మాట్లాడుతూ ఈ సంఘం బలోపేతానికి మ్యాచింగ్ గ్రాంటుతో పాటు ప్రభుత్వ సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. సంఘం అధ్యక్షుడు బిట్ల కృష్ణ మాట్లాడుతూ మాడల్ కూరగాయల మార్కెట్ వ్యాపారుల సంక్షేమమే లక్ష్యంగా ఏర్పాటు చేసుకున్న ఈ సంఘం సభ్యుల సహకారంతో తొలి వార్షికోత్సవం జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. సంఘం అభివృద్ధికి కృషి చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు, సంఘం సభ్యులు పాపని బాస్కర్, సామల రాజు, సూరయ్య, మురళి, ప్రకాష్, శేఖర్, మహేష్, హరి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టుశిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నర్సంపేట, జూన్ 21 : ఉచిత కుట్టుశిక్షణ శిబిరాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పాఖాల మహిళా బ్యాంక్ అధ్యక్షురాలు పెండెం రాజేశ్వరి పిలుపు నిచ్చారు. పట్టణంలోని హృదయస్పందన హోప్‌సేవా సొసైటీ ఆధ్వర్యంలో పాఖాల మహిళా బ్యాంక్‌లో ఉచిత కుటుశిక్షణ శిబిరాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. రాజేశ్వరి మాట్లాడుతూ 45 రోజులపాటు జరిగే ఉచిత కుట్టుశిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి పొందాలని మహిళలకు సూచించారు. కుట్టుశిక్షణ శిబిరానికి కుట్టుమిషన్లు అందించిన భవిత ట్యుటోరియల్ సంజన, ఉష ఉదయ్‌సింగ్‌లకు రాజేశ్వరి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హృదయస్పందన హోప్ సేవా సొసైటీ అధ్యక్షుడు పెండెం శివానంద్, గౌరవ అధ్యక్షుడు శానబోయిన రాజ్‌కుమార్, కల్లెపల్లి సురేశ్, గు ర్రపు అరుణ, పాలడుగుల అనిత, గొర్రె రాధ, పూజారి హేమ, రుద్రమదేవి, ఎస్ఎల్ఎఫ్ అధ్యక్షురాలు రజిత, శ్రీలత, బ్యాంక్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి



పంటను పరిశీలిస్తున్న జిల్లా అధికారి ఉష

చెన్నారావుపేట, జూన్ 21 : రైతులు వ్యవసాయశాఖాధికారుల సూచనలు పాటించాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి ఉషాదయాల్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఉప్పరపల్లి, కోనాపురం, జల్లి ,పాపయ్యపేట, అమీనాబాద్, గ్రామాల్లో రైతులు సాగుచేసిన పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వాతారణ పరిస్థితులకు అనుకూలంగా సాగు చేసే పంటలను ఎంచుకోవాలన్నారు. రైతులు వరిలో పంటల దిగుబడి కోసం పచ్చిరొట్ట ఎరువులను వాడుకోవాలన్నారు. వరి నాడుమడిలో రైతులు జాగ్రత్తలను పాటించాలన్నారు. రైతులు స్వల్ప కాలిక పంటలను సాగు చేపుకోవాలన్నారు. రైతుల భూముల్లో మట్టి నామునాలను సేకరించారు. అనంతరం రైతులకు సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ సారంగం, ఏవో శశికాంత్, వరంగల్ వ్యవసాయ అధికారి సీహెచ్ కృష్ణారెడ్డి, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

అరుంధతిరాయ్‌పై ఉపా కేసు ఎత్తివేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చినచంద్రన్న

నర్సంపేట టౌన్, జూన్ 21 : రచయిత్రి అరుంధతిరాయ్, ప్రొఫెసర్ షేక్‌షౌకత్ హుస్సేన్‌లపై పెట్టిన ఉపా కేసులను వెంటనే ఎత్తివేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి, వర్గ సభ్యుడు పాయం చినచంద్రన్న డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అరుంధతిరాయ్ కశ్మీర్ సమస్యపై 14ఏళ్ల క్రితం మాట్లాడిన విషయాన్ని తిరగదోడి మోదీ ప్రభుత్వం అక్రమ ఉపా కేసును బనాయించి వేధించడం తగదన్నారు. హక్కుల కోసం ఉద్యమించేవారిపైన హింసించే చర్యలు మానుకోవాలన్నారు. నీట్ పరీక్షలో అక్రమాలకు, అవినీతికి పాల్పడి విద్యార్థులను, వారి కుటుంబాలను ఆందోళనకు గురిచేసిన వారిపై కేంద్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టు జడ్జిచే విచారణ జరిపించాలని కోరారు. ఈ సమావేశంలో గడ్డం సదానందం, అడ్డూరి రాజు, నర్సింహాచారి, సూరి, నర్సింహారాములు పాల్గొన్నారు.

గంగదేవిపల్లిని సందర్శించిన సత్యసాయి జిల్లా వీడీఎల్‌లు



సందర్శించిన సత్యసాయి జిల్లా వీడీఎల్‌లు

గీసుగొండ, జూన్ 21 : మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామమైన గంగదేవిపల్లిని ఆంధ్రప్రదేశ్‌లోని సత్యసాయి జిల్లా తలుపుల మండలంలోని 11 గ్రామాల నుంచి 40మంది విలేజ్ డెవలప్‌మెంట్ లీడర్లు రాయలసీమ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా లీడర్ల బృందానికి గ్రామాభివృద్ధి కమిటీల పనితీరు, సాధించిన జాతీయ స్థాయి అవార్డులు, అభివృద్ధిలో ప్రజల స్వచ్ఛంద భాగస్వామ్యం గురించి జిల్లా ట్రెయినింగ్ మేనేజర్ కూసం రాజమౌళి వివరించారు. అవార్డుల ద్వారా రూ.11.48లక్షల నగదు లభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు శ్రీనివాస్, ధనలక్ష్మీ, లక్ష్మణ్, రిసోర్స్ పర్సన్స్ మేడిద సుశీల, గూడ సరోజన తదితరులు పాల్గొన్నారు.